క్లుప్తంగా

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్ : ఆషాడ మాసం సందర్భంగా మండలంలోని లక్కవరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మహిళలు చీర, ఆషాడ మాసం సారెలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు విజ్జు వెంకటస్వామి నాయుడు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

టి.నర్సాపురం : టి.నర్సాపురం మండలం కొత్తగూడెంలో ఆదివారం కొడెల్లి మహేష్‌కు చెందిన తాటాకిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ ప్రమాదం సంభవించడంతో ఇంట్లో గృహోపకరణాలు, సామగ్రి మొత్తం కాలిపోయింది. స్థానికులు మంటలను అదుపు చేశారు. ప్రమాదానికి గల కారణం తెలియరాలేదు.

వానలు కురవాలని..



అమ్మవార్లకు జలాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

టి.నర్సాపురం : టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంలో గ్రామ దేవతల విగ్రహాలకు గ్రామస్తులు ఆదివారం జలాభిషేకం నిర్వహించారు. గ్రామంలోని గంగానమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మమ్మల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ జలాభిషేకం నిర్వహించారు. దేవతల విగ్రహాలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బిందెలతో నీళ్లు పోసి పూజలు చేశారు.


గురువుకు సత్కారం



యోగా గురువు సూరిబాబును సత్కరిస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం : గురు పౌర్ణమి పురస్కరించుకుని కొయ్యలగూడెం మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువు చవ్వా సూరిబాబును శాలువాతో సత్కరించారు. గత 25 సంవత్సరాల నుంచి యోగ ధ్యాన మిత్ర శిక్షణ మండలిలో విద్యార్థులకు, ప్రజలకు ఉచితంగా నిర్వహిస్తున్న సేవలకు గాను సూరిబాబుకు సత్కారం నిర్వహించినట్లు సభ్యులు తెలిపారు. రిటైర్డ్ గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దిద్దే ఏబినైజర్, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నిడదవోలు రామారావు, వీఎస్ఎన్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సాయిబాల పద్మ

జంగారెడ్డిగూడెం రూరల్ : టెక్కినవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం ఉమెన్ డెవలప్‌మెంట్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో రికార్డులను ఆమె పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సాయిబాల పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకుంటూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా జీవించాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించేలా అంగన్‌వాడీ సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయురాలు వట్టి కనకదుర్గ పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

దెందులూరు: సోమవరప్పాడు గ్రామ సచివాలయంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు మండల ప్రత్యేకాధికారి కృపావరం కోరారు. శనివారం సచివాలయంలో ఆయన ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటుపై సమాచారం ప్రతి ఒక్కరికి తెలియజేయాలన్నారు. ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రం ద్వారా మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు.

పులకించే అమ్మఒడి

- నాలుగో ఏడాది అమ్మఒడి సొమ్ములు జమ
- ఆనందోత్సాహాల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు
- నియోజకవర్గస్థాయిలో జరుగుతున్న అమ్మఒడి వారోత్సవాలు
- 30,475 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సుమారు రూ.39,61,75,000 జమ
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న తల్లిదండ్రులు



అమ్మ ఒడి చెక్కును విద్యార్థుల తల్లులకు అందజేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం : విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొచ్చి పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ప్రభుత్వం బాటలు వేస్తోంది. నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీతోపాటు మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేస్తూ మాట తప్పని, మడమ తిప్పని నేతగా ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. విద్యా వ్యవస్థలో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా ప్రభుత్వ పాఠశాలల్లో నూతన ఒరవడి తీసుకొచ్చి దశ, దిశ మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ప్రపంచాన్ని మార్చగలిగే శక్తి విద్యకు మాత్రమే ఉందని భావించిన సీఎం జగన్ పేద విద్యార్థుల చదువుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. జగనన్న అమ్మ ఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా కానుక, నాడు–నేడు వంటి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. ముఖ్యంగా జూన్ మాసం వచ్చిందంటే పేద పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా అమ్మఒడి పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకంలో ప్రతిఏటా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లో రూ.13 వేలు జమ చేస్తున్నారు. ఇలా నాలుగో ఏట కూడా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ చేయడం జరిగింది. దీనితో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

3,0475 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సొమ్ము జమ

జగనన్న అమ్మ ఒడి పథకం అమలులో భాగంగా వరుసగా నాలుగో ఏడాది కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోన్‌రెడ్డి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో అమ్మ ఒడి సొమ్ములను జమ చేశారు. పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాలల పరిధిలో సుమారు 30475 మంది విద్యార్థుల తల్లుల ఖాతల్లోకి రూ. 39,61,75,000 జమ చేశారు. వీటిలో బుట్టాయగూడెం మండలంలో 4920 మందికి రూ. 6,39,60,000, జీలుగుమిల్లి మండలంలో 2787 మందికి రూ. 3,62,31,000, పోలవరం మండలంలో 4092 మందికి రూ.5,31,96,000, కొయ్యలగూడెం మండలంలో 7225 మందికి రూ.9,39,25,000, కుక్కునూరు మండలంలో 3406 మందికి 4,42,78,000, వేలేరుపాడు మండలంలో 2325 మందికి 3,02,25,000, టి.నర్సాపురం మండలంలో 5720 మందికి రూ.7,43,60,000 చొప్పున సొమ్ములను సీఎం జగన్ బటన్ నొక్కి తల్లుల ఖాతాల్లో జమ చేశారు. దీనితో నియోజకవర్గంలోని మండలాల్లో సంబరాలు అంబరాన్నంటాయి.

జగనన్నతోనే చదువుల విప్లవం



పేదరికం నుంచి బయట పడాలంటే విద్య ఒక్కటే మార్గమని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు విలువలతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నారు. అమ్మ ఒడి పథకంతో వరుసగా నాలుగో ఏటా తల్లుల బ్యాంక్ ఖాతాల్లోకి సొమ్ములు జమ చేసి పేదింట విద్యా వెలుగులు నింపేలా కృషి చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 30475 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో సుమారు రూ.39,61,75,000 ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు.

– తెల్లం బాలరాజు, ఎమ్మెల్యే, పోలవరం

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మా అమ్మాయి 3వ తరగతి చదువుతుంది. గత ఏడాది రూ.13 వేలు వచ్చాయి. ఈ ఏడాది కూడా సీఎం జగనన్న అమ్మఒడి పథకంలో రూ.13 వేలు జమ చేశారు. ప్రతిఏటా అమ్మ ఒడి డబ్బులు వేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న జగనన్నకు పిల్లల తల్లిదండ్రులు అందరూ రుణపడి ఉంటారు.

– మల్లం సరస్వతి, నాగంపాలెం గిరిజన గ్రామం, బుట్టాయగూడెం మండలం

నిరుపేదలకు అమ్మఒడి వరం



నిరుపేదలకు అమ్మ ఒడి పథకం వరం లాంటిది. జూన్ నెల వచ్చిందంటే పిల్లల చదువుకు ఇబ్బందులు పడేవారం. ఇప్పుడు అటువంటి బాధ లేదు. అమ్మ ఒడి పథకం మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకం అమలు చేస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాము.

– కుర్సం లక్ష్మీ నాగంపాలెం గిరిజన గ్రామం, బుట్టాయగూడెం మండలం

పొలం గట్టు విషయంలో దళితుడిపై దాడి



జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యేసు

కుక్కునూరు : పొలంగట్టు విషయంలో జరిగిన గొడవలో కొందరు వ్యక్తులు దళితుడి ఇంటిపై దౌర్జన్యం చేయడంతో పాటు దళితుడిని తీవ్రంగా కొట్టి గాయపరిచినట్టు బాధితుడి బంధువులు చెప్పారు. వివరాలు ఇలా ఉన్నాయి. వింజరం రెవెన్యూ పరిధిలోని పొలాల మధ్య దుక్కి దున్నే విషయమై ఆదివారం కరేటి శేఖర్, దాసరి యేసుబాబు గొడవ పడ్డారు. ఈ గొడవ విషయమై స్థానికంగా ఉన్న పెద్దమనిషి సమక్షంలో పంచాయతీ జరగగా ఇద్దరికి సర్దిచెప్పి పంపించివేశారు. అయితే మరోసారి యేసుబాబు వద్దకు శేఖర్ వెళ్లి గొడవపడి కొట్టుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న శేఖర్ వర్గీయులు యేసుబాబు ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేశారు. ముత్యాలంపాడులో ఉన్న విషయం తెలుసుకోని యేసుబాబు వద్దకు వెళ్లి తీవ్రంగా కొట్టి చంపేస్తామని బెదిరించారని బాధితుడి బంధువులు చెప్పారు. దాడిలో గాయపడిన యేసుబాబుని చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం తరలించారు. ఈ విషయమై కుక్కునూరు ఎస్సైని వివరణ కోరగా ఇరువర్గాల వారు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నట్టు చెప్పారు.

వీఎస్ఎస్ ప్లాంటేషన్లు కనుమరుగు



రెడ్డిగూడెం వీఎస్ఎస్ ప్లాంటేషన్ పరిధిలో నరికివేతకు గురైన వృక్షసంపద

కుక్కునూరు : వనసంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వృక్ష సంపద మండలంలో కనుమరుగయ్యే పరిస్థితి నెలకొంది. మండలంలోని రెండు అటవీరేంజ్‌ల పరిధిలో సుమారుగా 50కు పైగా వీఎస్ఎస్ కమిటీలుండేవి. కమిటీల ఆధ్వర్యంలో వందల ఎకరాల్లో వివిధ జాతుల వనసంపద ఉండేది. ఈ ప్లాంటేషన్ పరిధిలో జామాయిల్, మద్ది, విప్ప, తునికితో పాటు వివిధ రకాల వృక్ష జాతులుండేవి, ఆ ప్లాంటేషన్‌పై వచ్చే ఫలసాయాన్ని తీసుకోని జీవనోపాధి పొందే హక్కులు వీఎస్ఎస్ కమిటీలకు ఉండేవి. దీంతో పర్యావరణ కారిగా ఉపయోగపడడంతో పాటు గిరిజనులకు జీవనోపాధి అందేది. వీఎస్ఎస్‌ల పరిధిలోని వృక్షాలు నరికివేతకు గురికాకుండా చూసుకునే బాధ్యత ఇటు వీఎస్ఎస్ కమిటీలతో పాటు, అటవీశాఖాధికారుల మీద ఉండేది. కాని వీఎస్ఎస్‌లకు బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడంతో ప్రస్తుతం మండల వ్యాప్తంగా రెండు, మూడు కమిటీలు మాత్రమే యాక్టివ్ లో ఉన్నట్టు తెలుస్తుంది. దీంతో వివిధ గ్రామాల్లోని వీవీఎస్ ప్లాంటేషన్‌లోని జామాయిల్, ఇతర వృక్ష సంపద యథేచ్ఛగా నరికివేతకు గురవుతుంది. వృక్ష సంపదను నరికివేస్తుండడంతో ఆ ప్రభావం వన్యప్రాణుల మనుగడపై ప్రభావాన్ని చూపుతున్నాయి. వనసంపదను అడ్డుకోవాల్సిన సంబంధిత అధికారులు కూడా తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ప్లాంటేషన్‌ల పరిధిలోని వివిధ రకాల వృక్షాల మనుగడ ప్రశ్నార్థకంగా తయారైంది. వృక్షో రక్షతి రక్షితః అనే నినాదాన్ని సామాన్యులు మరిచిపోయినా సంబంధిత అధికార యంత్రాంగం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇప్పటికైనా వనసంపద నరికివేతపై అటవీశాఖాధికారులు అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బయ్యన్నగూడెంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన దృశ్యం

కొయ్యలగూడెం : బయ్యనగూడెం గ్రామం నాల్గవ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు ఆదివారం ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనులలో భాగంగా మూడు లక్షల రూపాయల లక్షల నిధులతో నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గడప గడపకు గుర్తించిన పనులను పూర్తి చేయాల్సిందిగా ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశించడంతో పంచాయతీ పరిధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం ప్రారంభించామన్నారు. వార్డుమెంబర్లు మద్దిపాటి శ్రీను, తుమ్మలపల్లి సూర్య చంద్రం, తుమ్మలపల్లి సత్యనారాయణ, తుమ్మలపల్లి విజయ్ కుమార్, నెర్సు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా భీమడోలు శివాలయం అభివృద్ధి పనులు





భీమడోలు శివాలయం చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్న దృశ్యం, ఆలయానికి రంగులు వేస్తున్న దృశ్యం

భీమడోలు: దేవాదాయ ధర్మశాఖ ఆధీనంలోని భీమడోలులోని అతిపురాతన దేవాలయం పార్వతీ సమేత భీమేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాకతీయుల కాలం నాటి ఈ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయ అభివృద్ధి కమిటీ తగు చర్యలు చేపట్టింది. దీనితో దాతల నుంచి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ప్రత్యేక శ్రద్ధ, తగు సహకారంతో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. దాతల నుంచి సమకూరిన రూ.లక్ష విరాళాలతో ఆలయంలో ప్రహరీ నిర్మాణం, ఫ్లోరింగ్, షెడ్లు, ఆలయానికి రంగుల వేసే పనుల చేపట్టారు. ఆలయ అభివృద్ధి కమిటీ నిర్వాహకులు చింతా శ్రీరామచంద్రమూర్తి, చింతా సత్తిబాబు సంయుక్త ఆధ్వర్యంలో దాతలు ఇచ్చిన విరాళాలతో ఆలయ అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఆలయం చుట్టూ ప్రహరీ లేకపోవడంతో నిర్మాణ పనులు చేపట్టారు. ఆలయంలో అభివృద్ధి పనుల్లో భాగంగా ఫ్లోరింగ్, ప్రహరీ, రంగులు వేసే పనుల్లో 40 శాతం పూర్తయ్యాయి. మండలంలో ప్రసిద్ధి చెందిన ఈ ఆలయాన్ని అభివృద్ధి పర్చేందుకు దాతల ఆర్థిక సాయం, సహకారం మరవలేనిదని పలువురు కమిటీ సభ్యులు తెలిపారు. మరికొంత దాతలు ముందుకు వస్తే అభివృద్ధి పనులకు ఊతం ఇచ్చిన వారవుతారని వారు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

భీమడోలు: సూరప్పగూడెంలో పేకాట స్థావరంపై ఆదివారం పోలీసులు దాడి చేసారు. గ్రామంలోని ఓ పామాయిల్ తోటలో పేకాట ఆడుతున్న ఆరుగురికి అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.4800 స్వాధీనం చేసుకున్నట్లు భీమడోలు పోలీసులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆత్మీయ విందు



లింగపాలెంలో భోజనాలు చేస్తున్న దృశ్యం

లింగపాలెం : లింగపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మైత్రి డెవలప్పర్స్ అధినేత బీవీఎస్ రెడ్డి వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఆదివారం ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. లింగపాలెం బీవీఎస్‌రెడ్డి గెస్ట్ హౌస్ ఆవరణలో ఏర్పాటు ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి, నూజివీడు ఎమ్మెల్యేలు ఉన్నమట్ల ఎలీజా, ప్రతాప్‌నాయనాయుడు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బీవీఎస్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరో మారు సీఎం కావాలన్నది తమ ధ్యేయమన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వర్గీకరణ సాధనకు ఐక్యంగా కృషి



వేగివాడలో పోస్టర్ ఆవిష్కరణ చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నేతలు

పెదవేగి : ఎస్సీ వర్గీకరణ సాధించి జాతి మనుగడ కోసం అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని ఎంఆర్పీఎస్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి మురళి చెప్పారు. పెదవేగి మండలం వేగివాడ పంచాయతీ బత్తెవరం గ్రామంలో మురళి ఆధ్వర్యంలో ఈ నెల 6న నిర్వహించనున్న హలో మాదిగ చలో కొయ్యలగూడెం కార్యక్రమంపై సన్నాహక సమావేశం ఆదివారం బత్తెవరంలో నిర్వహించారు. కొయ్యలగూడెం మండలం అంకాలగూడెంలో ఏర్పాటు చేసిన బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహావిష్కరణ అనంతరం ఎస్సీ వర్గీకరణ లక్ష్యంగా చలో హైదరాబాద్ సభను విజయవంతం చేసేందుకు ఏలూరులో నిర్వహించనున్న జిల్లా సన్నాహక సభకు మందా కృష్ణ మాదిగ హాజరు కానున్నారని కొత్తపల్లి మురళి తెలిపారు. ఈ సందర్భంగా హలో మాదిగ చలో అంకాలగూడెం, చలో హైదరాబాద్ కార్యక్రమాల విజయవంతంపై పోస్టర్ ఆవిష్కరణ వేగివాడలో జరిగింది. ఈ కార్యక్రమానికి కోస్తా ఆంధ్ర జిల్లాల ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ సమన్వయ కర్తలు ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ, జిల్లా ఎంఎస్పీ కన్వీనర్ కనకరాజు మాదిగ. కాట్రు పవన్, కాట్రు వెంకటేశ్వరరావు, లక్కపాము శ్రీనివాసరావు, బొకినాల నాగరాజు, కాట్రు రత్నం, కాట్రు లక్ష్మీ, కొండపల్లి ముక్కయ్య, తాడిగడప రామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష వద్దనే స్పందన ఫిర్యాదుల స్వీకరణ

ఉంగుటూరు: జగనన్న సురక్ష కార్యక్రమంలోనే స్పందన ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. జగనన్న సురక్ష కారణంగా జిల్లాస్థాయిలో స్పందన కార్యక్రమం నిలుపుదల చేశారని, ఈమేరకు సురక్ష కార్యక్రమంలోనే స్పందన ఫిర్యాదులు స్వీకరించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారని తెలిపారు. వెల్లమిల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నందున అక్కడ స్పందన ఫిర్యాదులు స్వీకరిస్తారని తహసీల్దారు వివరించారు.

నేడు శ్రీరామవరంలో జగనన్న సురక్ష

దెందులూరు: మండలంలోని శ్రీరామవరం గ్రామ సచివాలయంలో ఉదయం 8 గంటలకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు, సర్పంచ్ కామిరెడ్డి నాని తెలిపారు. శ్రీరామవరం గ్రామంలో వైఎస్సార్ రైతుభరోసా కేంద్రం ప్రారంభించి శ్రీరామవరం నుంచి సీతంపేట వరకు నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 9.30 గంటల వరకు కొవ్వలి సచివాలయం-2 పరిధిలో నిర్వహించే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారని కొవ్వలి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కాటి సుధాకర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడిగా మూర్తి



నూతన అధ్యక్షుడు మూర్తిని అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

నిడమర్రు: నిడమర్రు మండల ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ (పీఎంపీ) మండల అధ్యక్షుడిగా పెదనిండ్రకొలను వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ చినిమిల్లి నరసింహమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు అసోసియేషన్ జిల్లా కన్వీనర్ ఏఆర్‌కే పరమేశ్వర్లు ప్రకటించారు. ఆదివారం పెదనిండ్రకొలనులో పీఎంపీ అసోసియేషన్ మండల కార్యవర్గ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నిమ్మల సుబ్బారావు, గౌరవ సలహాదారుడిగా ఎ. సత్యనారాయణ, కార్యదర్శిగా సంకు శ్రీను, కోశాధికారిగా ఎస్‌కే మొహద్దీన్, ఉపాధ్యక్షుడిగా ఎస్ ఎస్ ఆలీ, జాయింట్ సెక్రటరీగా కె.శ్రీనివాసరావును సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ మండలంలోని మారుమూల ప్రాంతాల్లో అసోసియేషన్ తరుపున వివిధ రంగాల్లోని వైద్య నిపుణులను తీసుకువచ్చి ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసారు. నూతన అధ్యక్షుడు మూర్తిని పలువురు పీఎంపీలు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ వాహబ్, శాస్త్రి, కె. రాజేంద్ర ప్రసాద్ తదితరులున్నారు.

నేడు పలు గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని గురవాయిగూడెం, ఎ.పోలవరం గ్రామాల్లో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమకు అవసరమైన సర్టిఫికెట్లు పొందేందుకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే తలారి పరామర్శ



వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు, తదితరులు

ద్వారకాతిరుమల: మండలంలోని రామసింగవరం పంచాయతీ కొత్తగూడెంకు చెందిన వ్యాపారవేత్త పెన్మత్స నరసింహరాజు తల్లి వరలక్ష్మి ఇటీవల మృతి చెందారు. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఆదివారం కొత్తగూడెంలోని ఆమె ఇంటికి వెళ్లి, ఆమె కుమారులు చక్రవర్తిరాజు, కొండరాజు, వెంకటపతిరాజు, నరసింహరాజు, రామకృష్ణరాజులను పరామర్శించి, సంతాపాన్ని తెలిపారు. వరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో ద్వారకాతిరుమల జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, నల్లజర్ల సొసైటీ చైర్‌పర్సన్ కారుమంచి రమేష్ తదితరులున్నారు.

నీతి కథల పఠనంతో నైతిక విలువలు వృద్ధి



భీమడోలు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: నీతి కథలు చదవడం ద్వారా నైతిక విలువలు అలవడతాయని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేసారు. పుస్తక ప్రదర్శనలు ఏర్పాటు చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. చిన్నారులు కథలు, జీవిత చరిత్ర పుస్తకాలు, దినపత్రికలు చదివారు. ఈ కార్యక్రమంలో పూళ్ల, గుండుగొలను గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు మోహనరావు, కడగల సత్యనారాయణ, పాఠకులు, చిన్నారులు పాల్గొన్నారు.

కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యేకు దుర్గమ్మ ప్రసాదం అందజేత

దెందులూరు: విజయవాడ కనకదుర్గమ్మ ప్రసాదాన్ని శనివారం సోమవరప్పాడులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెడ్పీ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాద్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరికి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వేదకుమారి ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్లను అమ్మవారి ఆలయానికి దర్శనానికి రావాలని ఆహ్వానించారు. ప్రసాదం అందజేసినందుకు వేదకుమారికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

మానవత నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పెదపాడు: పెదపాడు మానవత శాఖ నూతన కార్యవర్గం ఆదివారం ప్రమాణ స్వీకారం చేసారు. స్థానిక శ్రీకృష్ణ గురుకుల పాఠశాలలో మానవత విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. మానవత శాఖ ఏర్పాటు అయినప్పటి నుంచి పేదలకు చేస్తున్న సేవలను వివరించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా మానవత రాష్ట్ర ప్రతినిధులు మారుబోయిన కోటేశ్వరరావుతోపాటు విశ్రాంత ఉపాధ్యాయులు పేర్ల సుబ్రహ్మణ్యం, లంకా మహాలక్ష్మయ్య, కుకునూరి రామకృష్ణారావు (రాంబాబు)పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు చేవూరి వెంకట్రావు, దావాల వెంకటేశ్వరరావు, వేల్పుల ప్రభాకరరావు, గుండవనేని సురేష్, విజ్జి శేఖర్, ఉప్పల రాజారమేష్, మునునూరి రామకృష్ణ, గారపాటి రాజారామ్మోహన రావు పాల్గొన్నారు.